క్లుప్తంగా

తండ్రి గెలుపు కోరుతూ తనయుల ప్రచారం



కేశనకుర్రులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తనయులు

ఐ.పోలవరం: సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో పేద ప్రజలకు అందిస్తున్న ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తనయులు సత్యసుమంత్, రేవంత్ పేర్కొన్నారు. గురువారం వారిద్దరూ తండ్రి గెలుపు కోరుతూ మండలంలోని కేశనకుర్రు, మురమళ్ల గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రిగా, తమ తండ్రి పొన్నాడను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమాల్లో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నమరాజు శ్రీనివాసురాజు, సర్పంచ్ కాలే రాజబాబు, పెనుమత్స వాసురాజు, ఇందుకూరి రంగరాజు గణపతివర్మ పాల్గొన్నారు.

వచ్చే నెల 1 నుంచి కోచింగ్ క్యాంపులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడా స్థలంలో బాల బాలికలకు మే 1వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకూ వేసవి ఉచిత కోచింగ్ క్యాంపులను నిర్వహించనున్నట్లు మాజీ జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంచే లక్ష్యంతో ఏటా వేసవిలో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేసవి ఉచిత క్యాంపుల్లో శిక్షణ పొందాలనుకునే బాల బాలికలు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని క్యాంపు నిర్వాహకులు సూచించారు.

నేడు విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం

అల్లవరం: స్థానిక సబ్ స్టేషన్‌కు చెందిన 11 కేవీ ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్, ఎంహెచ్‌క్యూ ఫీడర్, గోడిలంక ఫీడర్, సామంతకుర్రు ఫీడర్, ఓఎస్‌జీసీ ఫీడర్ల పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లవరం, గోడి, గోడిలంక, తూర్పులంక, గోడితిప్ప, కోడూరుపాడు, గూడాల, తాడికోన, ఎంట్రుకోన, డి.రావులపాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ నిలిచిపోతుందన్నారు.

అమలాపురం రూరల్: ఎ.వేమవరం, ఇందుపల్లి ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల కత్తిరింపు, వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఎ.వేమవరం, వేమవరప్పాడు, హైటెక్ కాలనీ, జనుపల్లి, నల్లమిల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ, ఇందుపల్లి, సాకుర్రు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ విద్యుత్ ఉండదన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

కాట్రేనికోన: ప్రతిపక్ష పార్టీలు అవలంబిస్తున్న నిరంకుశ వైఖరి, అనాలోచిత నిర్ణయాలను నిరసిస్తూ మండలంలోని కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని 72 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ ఇంతకాలం ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుపేదలకు చేరవేస్తూ ఎంతో సేవ చేస్తున్న తమపై చంద్రబాబు పదే పదే ఆరోపణలు చేయడం బాధించి ఉద్యోగాలకు రాజీనామా చేశామన్నారు.

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామివారి నిత్యాన్నదాన పథకం కోసం హైదరాబాద్‌కు చెందిన దొడ్డ పవన్‌కుమార్ దంపతులు రూ.50 వేలు విరాళాన్ని ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కార్యనిర్వాహణాధికారి స్వామివారి చిత్రపటం అందజేసి సత్కరించారు. వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్ ద్వారా నిత్యం వందలాది మంది భక్తులకు అన్నదానం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు తర్ఫీదునిస్తాం

అమలాపురం రూరల్: పదో తరగతి పాస్ అయిన విద్యార్థుల్లో ప్రతిభావంతులను గుర్తించి వారికి తర్ఫీదునిచ్చి ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశం కల్పించేలా కృషి చేస్తామని రాష్ట్ర కేజీబీవీ సెక్రటరీ మధుసూదన్‌రావు అన్నారు. రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అమలాపురం బుద్ధ విహార్‌లో అంబేడ్కర్ ఆశయ సాధన పే బ్యాక్ టు ద సొసైటీలో భాగంగా గురువారం జరిగిన సెమినార్‌లో మధుసూదన్‌రావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు బత్తుల నకులరాజు, ఎంతఓలు కె.కిరణ్ బాబు, నక్కా డేవిడ్ రాజు, వెంకటరమణ, ఏపీఎం ఎంఏకే భీమారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్న ముస్లింలు
- ఉపవాస దీక్షల విరమణ



యానాం జామియా మసీదులో రంజాన్ ప్రార్థనలు



అమలాపురం ముల్లా ముస్తాఫా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అమలాపురం టౌన్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలు నెల రోజుల పాటు చేసిన ఉపవాస దీక్షలను గురువారంతో విరమించారు. గురువారం రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్-ఉల్-ఫితర్, ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పవిత్ర ఖురాన్ గ్రంథం పఠనంతో నమాజ్‌లు చేశారు. స్థానిక ముల్లా ముస్తాఫా మసీదులో మౌలానా మహ్మద్ రజా రంజాన్ పండగ విశిష్టతను వివరించారు. దాదాపు రెండు వేల మంది ముస్లింలు పట్టణంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, అన్వర్ రాజా, ఎండీ ఆజామ్, ఎండీ అమీర్, ఖ్వాజాబాబు, ఎండీ బషీర్ పాల్గొన్నారు.

యానాం: స్థానిక చారిత్రక జామియా మసీదు, మసీదేకూబాలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించి పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆలింగనాలు చేసుకుంటూ ఉత్సాహంగా పండగను జరుపుకున్నారు. పరస్పరం స్వీట్లు పంచుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదిన అర్థమని ఇమామ్‌లు ఎండీ యర్ధానీ, ఎండి రఫీ పేర్కొన్నారు.

ముమ్మిడివరం: నియోజకవర్గంలో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో రంజాన్ నెల చివరి రోజు నమాజులను నిర్వహించారు. అనంతరం చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ఈద్ ముబారక్‌లు తెలుపుకున్నారు. పేదలను, నిస్సహాయ స్థితిలో ఉన్నవారిని ఆదుకోవడం ఇస్లాం ధర్మమని ముమ్మిడివరం గొల్లగూడెం వద్ద నున్న షియా మస్జిద్ మౌలానా మహమ్మద్ తఖీ పేర్కొన్నారు.

అమలాపురం రూరల్: రంజాన్ సందర్భంగా బండారులంకలో ఉన్న హజరత్ మహమ్మద్ నబీ మసీదులో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామిశెట్టి శ్రీను, అంకం పెద్దరాజులతో కలిసి వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన జగదీష్ చంద్ర గణేష్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం మత గురువు హైదర్ మహమ్మద్ ఫార్జిత్‌కు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చింతా ఉమామహేశ్వరరావు, కారుపర్తి మల్లేశ్వరరావు, క్రీస్తుబాబు, గిడ్ల శ్రీను, జొన్నాడ బాబ్జి, పెసింగి రాజు, ముస్లిం పెద్దలు పఠాన్ సలీం ఖాన్, పఠాన్ బాషా వల్లి, పఠాన్ ఫిరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరం మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి, విలసవిల్లి గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉపవాస దీక్షలు విరమించి మసీదుల్లో మత గురువుల సమక్షంలో ప్రత్యేక నమాజులు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి



ఎమ్మెల్యే పొన్నాడ, రాపాక, పితానిలను సత్కరిస్తున్న జగదీశ్వరరావు తదితరులు

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసిన వారికి పార్టీ పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పిస్తుందని, పదవులు పొందిన వారు పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కోరారు. గురువారం తాళ్లరేవు మండలం నుంచి పలు విభాగాల అధ్యక్ష పదవులు పొందిన దడాల జగదీశ్వరరావు, వెంటపల్లి వాసంతి, ముద్దన వెంకట శివరామప్రసాద్‌లు ఎమ్మెల్యే పొన్నాడను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడతో పాటు, వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటు అభ్యర్థి రాపాక వరప్రసాద్, పార్టీ నేత పితాని బాలకృష్ణలను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, నల్లా నరసింహమూర్తి, రేవు మల్లీశ్వరి, పెయ్యల మంగేష్, కె.చందు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందాం



పేరూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి



ప్రచార రథం పైనుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి విశ్వరూప్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- పేరూరులో ఎన్నికల ప్రచారం

అమలాపురం రూరల్: సంక్షేమ రథ సారథి జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని పేరూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా తోట్లపాలెం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. వందలాది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచార రథంపై నుంచి విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావులు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పేరూరులో మంత్రి విశ్వరూప్ ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మహిళలు హారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా విశ్వరూప్ మట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాలంటే తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికల ప్రచారంలో గడప గడపకూ వెళుతున్న తనకు గతంలో ఎప్పుడూ చూడనంతటి ప్రజా స్పందన కనిపిస్తుందని, వైఎస్సార్ సీపీ విజయానికి ఇదే సంకేతమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సర్పంచ్‌లు దాసరి అరుణ, చెల్లుబోయిన నాని, ఎంపీటీసీలు చొల్లంగి సుబ్బిరామ్, వాసంశెట్టి శ్రీనివాస్, దొంగ ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి దేవరపల్లి గీత, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సూదా గణపతి, ఇళ్ల ఏడుకొండలు, పాలగుమ్మి వాసు, యువత అధ్యక్షుడు కేతా భానుతేజ పాల్గొన్నారు.

సంక్షేమ రాజ్యం కోసం జగనన్నను ఆశీర్వదించండి



గిడ్డివారిపేటలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు



కుండలేశ్వరంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ, ఎంపీ అభ్యర్థి రాపాక

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- కుండలేశ్వరం, నడవపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

కాట్రేనికోన: సంక్షేమ రాజ్యం కోసం ప్రజలంతా జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వర ప్రసాదరావు, సీనియర్ నాయకుడు పితాని బాలకృష్ణలతో కలిసి కుండలేశ్వరం, నడవపల్లి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు అడుగడుగునా వారికి బ్రహ్మరథం పట్టారు. ముందుగా కుండలేశ్వరంలో పార్వతీ సమేత కుండలేశ్వర స్వామిని దర్శించుకున్న పొన్నాడ ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. తనేలుపేట, గిడ్డివారిపేట, నడవపల్లి గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నవరత్నాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధిని అందించామని పొన్నాడ అన్నారు. వలంటీర్లు ప్రతి నెలా 1వ తేదీన తలుపు తట్టి మరీ పెన్షన్ సొమ్మును అవ్వా, తాతలకు అందజేసేవారని, టీడీపీ కుట్రతో సచివాలయాలకు వెళ్లి తీసుకోవలసి వచ్చిందని రాపాక అన్నారు. రాష్ట్రంలో ఫ్యాను గాలి వీస్తుందని, ప్రతి పక్షాలు ఫ్యాను గాలికి కొట్టుకుపోవడం ఖాయమని పితాని బాలకృష్ణ అన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగనన్నకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, పాలెపు ధర్మారావు, నడింపల్లి సూరిబాబు, ఏడిది సుబ్బు, కాశి బాల మునికుమారి, అక్కల శ్రీధర్, దొమ్మేటి పల్లవి, బొమ్మిడి శ్రీను, శివరామకృష్ణ, నాతి సత్యనారాయణ, సంసాని నాగేశ్వరరావు, నల్లా బేబి జానకి, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జి, సానబోయిన నాగేశ్వరరావు, బొమ్మిడి సూరిబాబు, ముడిదుడ్డి రామారావు పాల్గొన్నారు.

కార్యకర్తలకు వెన్నుదన్నుగా వైఎస్సార్ సీపీ



వైఎస్సార్ సీపీలో చేరినవారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పితాని బాలకృష్ణ



సమావేశంలో పాల్గొన్న మంత్రి విశ్వరూప్, పితాని బాలకృష్ణ

ఐ.పోలవరం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటుందని వైఎస్సార్ సీపీ నాయకుడు పితాని బాలకృష్ణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న శెట్టిబలిజ పేటల్లో గురువారం ఆయన పర్యటించి పలువురిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని టి.కొత్తపల్లి పంచాయతీ గంజావారి మెరక నుంచి పితాని బాలకృష్ణ సమక్షంలో శీలం త్రిమూర్తులు(పండు), గంజా అశోక్, శీలం శ్రీనివాస్, పంపాని సత్తిబాబు, శీలం జైకృష్ణ, కుడిపూడి వాసు, యనమదల బాబ్జి ఆధ్వర్యంలో సుమారు 300 మంది వివిధ పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పితాని బాలకృష్ణ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన వెంట మండల పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు దొమ్మేటి దుర్గాప్రసాద్, పితాని రామకృష్ణ, మట్టపర్తి సురేష్, కాంద్రేగుల శ్రీనివాస్ తదితరులున్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు పితానివారిపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు పితాని బాలకృష్ణ అధ్యక్షతన శెట్టిబలిజ పెద్దలతో ఆత్మీయ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అమలాపురం నియోజకవర్గ అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడదామన్నారు. పితాని బాలకృష్ణ మాట్లాడుతూ శెట్టిబలిజ నాయకులు వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి మంత్రి విశ్వరూప్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని నాని పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డా.భానుమతి తదితరులు

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరం పంచాయతీ రాంజీనగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని వైద్యురాలు డా.భానుమతి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమలాపురం ఎంపీ చింతా అనూరాధ, ఎంపీపీ రాయుడు సునీత, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు తదితరులు హాజరై మాట్లాడారు. పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం తన జీవితాన్ని ధారబోసిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, భూపతిరాజు బుల్లిరాజు, రాయుడు గంగాధర్, మట్టపర్తి లోవరాజు, ముద్దన వెంకట శివరామ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం

ఐ.పోలవరం: మండలంలోని కొమరగిరి జాంబవానిపేటలో టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పితాని బాలకృష్ణ కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు

అమలాపురం రూరల్: మండలంలోని రోళ్లపాలెంలో అమలేశ్వరీదేవి సమేత అమలేశ్వర స్వామి ఆలయ శిఖర పునఃప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా బ్రహ్మశ్రీ నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో గురువారం భూతబలి సంకల్పం విఘ్నేశ్వరార్చన, పుణ్యాహవచనం, పంచగవ్య మండపారాధనం, దీక్షాధారణం, గోపూజ, వాస్తుపూజ నిర్వహించారు. శుక్రవారం శిఖర పునఃప్రతిష్ఠ నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు రాయుడు రామారావు తెలిపారు.

యానాం అభివృద్ధికి నమశ్శివాయంను గెలిపించాలి

- ఎన్నికల ప్రచార సభలో ఎమ్మెల్యే అశోక్ పిలుపు



గజమాలతో నమశ్శివాయం, అశోక్‌లను సత్కరిస్తున్న అభిమానులు

యానాం: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధుల సాధన కోసం బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీయే కూటమి అభ్యర్థి నమశ్శివాయంను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. గురువారం స్థానిక గాజుల గార్డెన్స్‌లో ఏర్పాటుచేసిన నమశ్శివాయం ప్రచారసభలో ఆయన మాట్లాడారు. ముందుగా ఎంపీ అభ్యర్థిగా ఎన్నికల ప్రచారం కోసం యానాం విచ్చేసిన పుదుచ్చేరి హోంమంత్రి నమశ్శివాయంకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ పుదుచ్చేరిలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉండాల్సిన ఆవశ్యకత ఉందని అందుకే తాను ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిచినా యానాం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం కూటమికి మద్దతిస్తున్నానని చెప్పారు. నమశ్శివాయం ఎంపీగా గెలిస్తే కేంద్రమంత్రి హోదాతో యానాంకు మరిన్ని నిధుల సాధనకు అవకాశం ఉంటుందన్నారు. గృహ నిర్మాణ రుణాలు, ఇళ్ల పట్టాలు, పర్యాటకాభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనకు కేంద్రంతో నిధులు సాధించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి నమశ్శివాయం మాట్లాడుతూ ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఎల్లప్పుడూ యానాం నియోజకవర్గం అభివృద్ధి కోసమే తపిస్తుంటారని, తాను ఎంపీగా గెలిస్తే తప్పనిసరిగా ఆయనకు పూర్తిస్థాయిలో సహకారమందించి యానాంను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం హోంమంత్రి నమశ్శివాయం, ఎమ్మెల్యే అశోక్‌లను భారీ గజమాలతో సత్కరించారు.

పోరాట యోధుడు జ్యోతిరావు ఫూలే

- ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్
- ఫూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు



ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు



తాళ్లరేవులో ఫూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: సమ సమాజ స్థాపన కోసం పాటు పడ్డ పోరాట యోధుడు మహాత్మా జ్యోతిరావు ఫూలే అని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక శెట్టిబలిజ గ్రంథాలయంలో గురువారం జ్యోతిరావు ఫూలే 197వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ కుడుపూడి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కుడుపూడి త్రినాథరావు, మట్టపర్తి నాగేంద్ర, ముంగర ప్రసాద్, గుత్తుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు ఫూలే నేటి తరానికి మార్గదర్శకుడని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. స్థానిక ఎత్తు రోడ్డులో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఫూలే జయంతి వేడుకల్లో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు, ఏఐసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు తెన్నేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఆధ్వర్యంలో స్థానిక ఎర్ర వంతెన వద్ద గల పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి కార్యక్రమం జరిగింది.

తాళ్లరేవు: బడుగు, బలహీన వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన మహాత్మా జ్యోతిరావు ఫూలే ఎందరికో స్ఫూర్తి ప్రదాత అని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. గురువారం తాళ్లరేవులో జరిగిన ఫూలే జయంతి వేడుకల్లో ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, ప్రజా సంఘాల నాయకుడు టి.ఈశ్వరరావు, దున్నా జనార్ధనరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఫూలే చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అణగారిన వర్గాల్లో అక్షర జ్యోతి వెలిగించిన మహనీయుడు ఫూలే అని కొనియాడారు. కార్యక్రమంలో కాశి వెంకటాచార్య, జనిపెల్ల బాలకృష్ణ, ఎం.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: భారతదేశంలో మానవ హక్కుల్ని ప్రవేశ పెట్టిన తొలి వెలుగు మహాత్మా జ్యోతిరావు ఫూలే అని పలువురు విద్యావేత్తలు పేర్కొన్నారు. గురువారం ఐ.పోలవరంలో ఫూలే జయంతిని పురస్కరించుకుని ప్రజ్ఞాసాహితీ ఆధ్వర్యంలో ఫూలే-అంబేడ్కర్ భావజాల సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధినేత పి.వెంకటేశ్వరావు, ఆకెళ్ల సూర్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక దక్షిణామూర్తి వీధిలో మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి వేడుకలు గురువారం రాత్రి నిర్వహించారు. తొలుత ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ, బొక్కా వీర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యానాంలో భారీ బైక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సీఎం రంగసామి, నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీయే కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నమశ్శివాయం గెలుపు కోరుతూ గురువారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో యానాంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక యర్రా గార్డెన్స్‌లో మల్లాడి స్వగృహం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. సీఎం రంగసామి, హోంమంత్రి నమశ్శివాయం ప్రత్యేక వాహనంలో ర్యాలీలో పాల్గొని ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పలుచోట్ల స్థానికులు పూలమాలలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం పెదపూడివారి వీధి, ఆర్ఏఓ ఆఫీసు వీధి, ఫ్లడ్‌బ్యాంక్ వీధి, అగ్రహారం, భీమ్‌నగర్, యూకేవీనగర్, కనకాలపేట, ఫ్లడ్ బ్యాంక్ రోడ్డు, కనకాలపేట, ఫిషర్‌మెన్ పేట, గోపాల్ నగర్, మెట్టకూరు, అంబేడ్కర్ నగర్, పాత బస్టాండ్, సీతారామ నగర్, అయ్యన్న నగర్, దరియాలతిప్ప, గిరియాంపేట ప్రాంతాల మీదుగా బైక్ ర్యాలీ సాగింది. ర్యాలీలో అధిక సంఖ్యలో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.